## రెండు రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్, జనవరి 17 : దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌కు నీరు చేరే ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతుల నేపథ్యంలో రెండు రోజులు నగరంలోని పలు ప్రాంతాల్లో తాగు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కేఎంసీ వాటర్ ట్యాంక్, కంటి ఆస్పత్రి వాటర్ ట్యాంక్, రంగంపేట, కొత్తవాడ, రామన్నపేట, పోతననగర్, సంతోషిమాత కాలనీ, గాయత్రీ నగర్‌తో పాటు శాయంపేటలోని కొన్ని ప్రాంతాల్లో శని, ఆదివారాలు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## దళిత కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

పరకాల, జనవరి 17 : దళిత కాలనీల్లో సమస్యలను అధికారులు గుర్తించి వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు బొచ్చు చిన్నికృష్ణ శుక్రవారం కమిషనర్ సుష్మకు వినతిపత్రం అందించారు. దళిత కాలనీల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పలు చోట్ల వీధి లైట్లు వెలగడం లేదని, మురుగు నీరు నిల్వ ఉంటున్నదని, వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. బొచ్చు విశాల్, శ్రీధర్ పాల్గొన్నారు.

## కటాక్షపురానికి సరిహద్దులు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, జనవరి 17 : కటాక్షపురం గ్రామానికి సరిహద్దులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, సీఐ సంతోష్‌కు శుక్రవారం మాదిగ కులస్తులు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో అంత క్రియలు నిర్వహించే క్రమంలో పక్కనే ఉన్న మహ్మద్ గౌస్ పల్లి మాదిగ కులస్తులతో తరుచూ వివాదాలు జరుగుతున్నాయన్నారు. రెండు గ్రామాల మధ్య సరిహద్దుల్లో స్పష్టత లేకపోవడమే దీనికి కారణమని, వెంటనే రెండు జీపీల్లో సరిహద్దులు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## కనుల పండువగా త్రిశూల స్నానం


త్రిశూల కలశంతో వస్తున్న ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా

భీమదేవరపల్లి, జనవరి 17 : కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం త్రిశూలస్నాన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో తీసుకుని రాగా, ఆలయ చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, ఈవో కిషన్ రావు, ధర్మకర్తలు త్రిశూల కలశాలను ఎత్తుకున్నారు. అర్చకులు రాంబాబు, వినయ్, శ్రీకాంత్, ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్, ఎస్సై నంద్రు సాయిబాబు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పల్లా పూజలు..**

కొత్తకొండ వీరభద్రస్వామి వారిని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. గుమ్మడికాయతో ఆలయ ప్రదక్షిణ చేశారు. చైర్మన్, ఈవో ఎమ్మెల్యేకు స్వామివారి మెమెంటో అందజేశారు. మాజీ జడ్పీటీసీ చాడ సరితారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, నాయకులు గుడివెనుక దేవేందర్, భూపతి రాజు, గోవింద సురేశ్, ఇట్టవేన సంపత్, జాని పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. 1 issue the following notice to general public. My client intends to grant to loan to title Bontha Anil. S/o: Komuraiah, Age: 34 years. Occ: Agriculture, R/o: H.No. 1-198. Jaganathapoor, Jeelgula village Elkathurthy mandal of Hanamakonda dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

**SCHEDULE OF THE PROPERTY**

All that the residential house with open place property bearing GP H.No. 2-36, to an extent of 526.50 Square yards its equivalent to an extent of 440.21 Square meters, RCC plinth area 703.63 Square feet's, within the boundaries
East: GP Road, West): House of Kasthuri saraiah
North: House of Shivarathri Buchaiah
South: House of Kasthuri komuraiah
Is situated at Jaganathapoor, Jeelgula village Elkathurthy mandal of Hanamakonda dist
Date: 17-01-2025
Sd/- G. LAXMANA MURTHY, ADVOCATE
# 20-123/1, Vidyanagar, Huzurabad. CELL: 94403 69866

## గంజాయి పట్టివేత

కాజీపేట, జనవరి 17 : కాజీపేటలో పోలీసులు శుక్రవారం గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అమీన్‌పేటకు చెందిన నకిరకంటి పవన్ (24) నిట్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పట్టణంలోని బంధం చెరువు కట్ట వద్ద శుక్రవారం సాయంత్రం పవన్ 280 గ్రాముల గంజాయి అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. పవన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**కావలెను**
★ వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ లో పనిచేయుటకు కంప్యూటర్ MS OFFICE, WORD, EXCEL ఆపరేటింగ్ లో డిగ్రీ అర్హతతో తెలుగు & ఇంగ్లీష్ TYPE Writing లో అనుభవం కలిగిన మహిళలు/ పురుష అభ్యర్థులు మరియు ఆఫీసులో పనిచేయుటకు ఆఫీస్ బాయ్స్ అర్జెంటుగా కావలెను. సంప్ర :9866160555
NTW-000

**PLOTS FOR SALE**
★ Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

**CHANGE OF NAME**
★ I, BOINAPALLY DEVENDAR RAO, S/o. Boinapally Linga Rao, Resident of H.No. 1-23, Gopalpur (V), Yelkathurthy (M), Hanumakonda Dist.-505 476. Change My Name BOINAPELLY DEVENDER RAO to BOINAPALLY DEVENDAR RAO for all purposes.
NT-337378

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# కొండంత లక్ష్యం.. వసూళ్లపై నిర్లక్ష్యం

- జిల్లా డిమాండ్ రూ. 8,73,55,142
- ఇప్పటి వరకు రూ.6,31,52,675 వసూళ్లు
- ఎన్నికలకు ముందే వసూళ్లపై దృష్టి పెడితే మేలు
- వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటామంటున్న పీఆర్ అధికారులు


ఐనవోలు మండలం రాంనగర్‌లో ఇంటి యజమానికి పన్ను రసీదు అందజేస్తున్న జీపీ సిబ్బంది

హనుమకొండ, జనవరి 17 : గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సంవత్సర కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదని పంచాయతీ రాజ్ అధికారులు తెలిపారు. దీంతో పల్లెలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. కాగా, ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ట్యాక్స్, నాన్ ట్యాక్స్ కలిపి 70.51 శాతం పన్నులు వసూలైనట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. జిల్లా పంచాయతీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మొత్తం రూ. 8,73,55,142 లక్ష్యం కాగా, ఈ నెల 8వ తేదీ వరకు రూ.6,31,52,675 మాత్రమే వసూలయ్యాయి. పరకాల మండలం 81.21 శాతంతో మొదటి స్థానంలో, ఐనవోలు మండలం 61.83 శాతంతో చివరి స్థానంలో ఉంది. గత ప్రభుత్వ పాలనలో చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమంతో అభివృద్ధి బాటలో నడిచిన గ్రామాల్లో ప్రస్తుతం సమస్యలు పేరుకుపోతున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 208 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలింది కేవలం రెండున్నర నెలలు మాత్రమే. వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలంటే గ్రామాల్లో ఇంకా రూ.2,42,02,467 వసూలు చేయాల్సి ఉంది. అయితే మరో నెల, రెండు నెలల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలైతే సమయం మొత్తం ఎన్నికలకే పోతుంది. అధికారులు మాత్రం మార్చి నెలాఖరు వరకు తమ లక్ష్యాన్ని చేరుకుంటామని, వంద శాతం పన్నులు వసూలైన గ్రామ పంచాయతీ సిబ్బందిని ఇతర గ్రామాలకు పంపించి పన్నులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని మండలాల్లో ఇంటి పన్నులకు సంబంధించి లక్ష్యాన్ని చేరుకోగా, నాన్ ట్యాక్స్‌కు సంబంధించి కొన్ని గ్రామాలు వెనుకబడి ఉన్నాయి. రెగ్యులర్ విధులతో పాటు ఇతరత్రా విధుల నిర్వహణ నేపథ్యంలో పన్నుల వసూళ్లలో ఆలస్యం జరుగుతున్నదని కొందరు పంచాయతీ ఉద్యోగులు అంటున్నారు.

**లక్ష్యాన్ని చేరుకుంటాం..**
**- లక్ష్మీరమాకాంత్, డీపీవో**



లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు సుమారు 80 శాతం వరకు పన్నులు వసూలు చేశాం. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాం. మార్చి నెలాఖరు వరకు వందం శాతం పన్నులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తాం. ఈ విషయంలో రోజు వారీగా నివేదికలు తెప్పించుకొని వెనుకబడి ఉన్న గ్రామ పంచాయతీల సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాం.

**మండలాల వారీగా పన్నుల వసూళ్ల వివరాలు..**

| మండలం పేరు | జీపీలు | లక్ష్యం | వసూలైంది | కావాల్సింది |
|---|---|---|---|---|
| 1. భీమదేవరపల్లి | 22 | 1,24,54,396 | 89,70,301 | 34,84,095 |
| 2. ధర్మసాగర్ | 19 | 78,91,175 | 53,84,209 | 25,06,966 |
| 3. ఎల్కతుర్తి | 19 | 92,81,737 | 68,15,276 | 24,66,461 |
| 4. హసన్‌పర్తి | 15 | 57,98,738 | 43,56,258 | 14,42,480 |
| 5. ఐనవోలు | 17 | 83,30,366 | 52,60,812 | 30,69,554 |
| 6. కమలాపూర్ | 24 | 1,37,60,319 | 1,06,66,415 | 30,93,904 |
| 7. వేలేరు | 14 | 48,62,367 | 32,85,289 | 15,77,086 |
| 8. ఆత్మకూరు | 16 | 77,90,803 | 58,16,895 | 19,73,908 |
| 9. దామెర | 14 | 57,51,366 | 41,75,992 | 15,74,374 |
| 10. నడికూడ | 14 | 35,65,264 | 26,87,518 | 8,77,746 |
| 11. పరకాల | 10 | 20,66,696 | 16,69,784 | 3,96,972 |
| 12. శాయంపేట | 24 | 58,01,915 | 40,62,934 | 17,38,981 |
| మొత్తం | 208 | 8,73,55,142 | 6,31,52,675 | 2,42,02,467 |

## సన్నాహక మహా ప్రదర్శన జయప్రదం చేయండి

హనుమకొండ/హసన్‌పర్తి/న్యూశాయంపేట, జనవరి 17 : ఈ నెల 20వ తేదీన జరిగే లక్ష డప్పులు వేల గొంతుల సన్నాహక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన వేయి స్తంభాలగుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించే మహా ర్యాలీకి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరు కానున్నారన్నారు. లక్షల కోట్లు సంపాదించిన గడ్డం వివేక్ కుటుంబం, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే లాంటి రాజకీయ నాయకులు అడ్డుపడుతున్నారన్నారు. కవి, రచయిత మిట్టపల్లి సురేందర్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్, మంద కుమార్, బొడ్డు దయాకర్, బొచ్చు తిరుపతి, గోపు జయపాల్‌రెడ్డి, మేకల కేదార్ యాదవ్, బైరపాక జయకర్ పాల్గొన్నారు. హసన్‌పర్తిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పుట్ట రవి, సుకుమార్, రాజారపు భిక్షపతి, బోడ యుగేందర్, ఆరెపల్లి పవన్ పాల్గొన్నారు. అలాగే నగరంలో జరగనున్న సంఘీభావ ర్యాలీ, ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు -వేల గొంతుల ప్రదర్శనకు భారీగా తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో బ్రోచర్ ఆవిష్కరించారు.

## స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించాలి


కేశవరావు ఆడిటోరియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ, జనవరి 17 : స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించుకోవడం అందరి కర్తవ్యమని, వారి త్యాగాలను చిరస్థాయిగా గుర్తుంచుకోవాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బాలసముద్రంలోని జమలాపురం కేశవరావు ఆడిటోరియం భవనాన్ని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. స్వాతంత్ర్య సమరయోధుల సేవలకు ప్రత్యేకంగా కార్యాలయం కేటాయించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే వివరించారు. గణతంత్ర దినోత్సవం నాటికి ఈ భవనాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ కార్పొరేషన్ మరియు ప్రజ్వల్ రైతు ఉత్పత్తి దారుల సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, సీఎంవోహెచ్ రాజిరెడ్డి, మున్సిపల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, ప్రజ్వల్ సీఈవో పెద్దపల్లి రామ్మూర్తి, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ అనుముల శ్రీనివాస్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ రమేశ్ పాల్గొన్నారు.

## ఎంపీడీవోను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

హసన్‌పర్తి, జనవరి 17 : హసన్‌పర్తి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన కరుణాకర్‌రెడ్డిని శుక్రవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండి రజినీకుమార్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రవి, రాజు పాల్గొన్నారు.

## వినియోగదారుల చట్టంపై అవగాహన

హనుమకొండ, జనవరి 17 : బాలసదనం బాలికల ఆశ్రమంలో విద్యార్థులు, సిబ్బందికి వినియోగ దారుల హక్కుల చట్టం-2019, రక్షణ, బాధ్యతపై శుక్రవారం వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో నేషనల్ వైస్ చైర్మన్ అండ్ అడ్వైజర్ అనితా రెడ్డి అవగాహన కల్పించారు. విద్యార్థులకు కొత్త దుస్తులు అందించారు. బాలసదనం నిర్వాహకురాలు కల్యాణి పాల్గొన్నారు.

## 20న మహాజన సభ

హనుమకొండ, జనవరి 17 : ఈ నెల 20వ తేదీన వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభను నిర్వహిస్తున్నట్లు డీసీసీ బ్యాంకు సీఈవో ఎండీ వజీర్ సుల్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయం మూడో అంతస్తులోని ఆడిటోరియంలో టీజీ క్యాబ్ చైర్మన్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన పాలకవర్గం సమక్షంలో నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరారు. 2024-25 సంవత్సరంలో ఇప్పటి వరకు బ్యాంకు సాధించిన పురోగతి, సాధించాల్సిన అభివృద్ధిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

## బ్యాంకింగ్ పరీక్షలకు ఉచిత శిక్షణ

హనుమకొండ చౌరస్తా, జనవరి 17 : ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సు కోసం 100 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్న బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎంపీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.inలో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించొద్దన్నారు. ఇంటర్, డిగ్రీ పరీక్షలో పొందిన మార్కులు, రిజర్వేషన్ల ప్రకారం ఎంపిక ఉంటుందన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుంచి 14వ తేదీ వరకు ఉంటుందని, ఫిబ్రవరి 15 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. వివరాలకు 0870-2571192, 040-24071178 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జనవరి 17 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. షిఫ్టింగ్ పనుల వల్ల సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని విష్ణుపురి వాటర్ ట్యాంక్, పోలీస్ స్టేషన్, డాక్టర్ వెంకట్‌రెడ్డి ఆస్పత్రి, సాయి షాపుర్జీ కాంప్లెక్స్, సోమిడి రోడ్డు, విష్ణుపురి, రహమత్‌నగర్, జూబ్లీ మార్కెట్, వెంకటాద్రినగర్, సోమిడి, కాజీపేట మెయిన్‌రోడ్డు, రైల్వే స్టేషన్, డీ మార్ట్ ఏరియాల్లో విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వడ్డేపల్లి, మడికొండ, కాజీపేట సెక్షన్లలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## ఐలోని మల్లన్న హుండీ ఆదాయం రూ.1.80కోట్లు

ఐనవోలు, జనవరి 17 : ఐనవోలు మల్లికార్జునస్వామి హుండీ, టిక్కెట్ల ద్వారా రూ.1.80కోట్ల ఆదాయం వచ్చినట్లు శుక్రవారం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. 91 రోజులకు గాను 23 హుండీలను లెక్కించగా రూ. 31,59, 335 ఆదాయం సమకూరిందన్నారు. వివిధ రకాల టిక్కెట్ల ద్వారా రూ.1,48,67,173 మొత్తం రూ.1,80,26,508 ఆదాయం వచ్చిందని చెప్పారు. గత సంవత్సరం కంటే రూ.15,40,895 ఎక్కువ ఆదాయం వచ్చిందన్నారు. పరిశీలకులుగా అనిల్‌కుమార్, ఆర్ఐ రాణి, కానిస్టేబుల్ రమేశ్, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి, అర్చకులు, సిబ్బంది కిరణ్, శ్రీకాంత్, కన్నయ్య, రాజు పాల్గొన్నారు.

# అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష



కలెక్టరేట్‌లో మట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

హనుమకొండ, జనవరి 17 : షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని మండలాలు, షెడ్యూల్ కులాల జనాభా, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన రుణాలు, శిక్షణ కార్యక్రమాలు, దళిత బంధు, ఎస్సీ స్టడీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలు, సంక్షేమ హాస్టల్స్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం, వైద్య ఆరోగ్య, ఉపాధి హామీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు అందించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై అధికారులు రాంచందర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెడ్యూల్ కులాలు అభివృద్ధి చెందే విధంగా సకాలంలో రుణాలు అందించి ప్రోత్సహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఫసల్ బీమా పథకాన్ని జిల్లాలో ఎంతమంది రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారో జాబితా అందించాలన్నారు. ప్రైవేటు రంగంలోనూ వీరికి రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగావకాశాలను కల్పించాలని సూచించారు. ఔత్సాహికులను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అధికారులు ప్రోత్సహించాలన్నారు. న్యాయ విద్యను అభ్యసించే షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ప్రభుత్వ అందిస్తున్న సహాయం వివరాలు తెలపాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు షెడ్యూల్డ్ కులాలకు ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో అందుతున్నాయా? లేదా అని తెలుసుకునేందుకు జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ ల్యాండ్ వేరే వ్యక్తులు సాదాబైనామా ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే అది చట్టబద్ధం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దళిత బంధు పథకం నుంచి వచ్చిన ట్రాక్టర్ ఎత్తుకెళ్లారని, ఫిర్యాదు చేసినప్పటికి పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని, ఎస్సీలకు చెందిన భూములు కబ్జాలకు గురువుతున్నాయనే అంశాలపై ఎక్కువగా వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, జాతీయ షెడ్యూల్డ్ కులాల రీసెర్చ్ అధికారి వరప్రసాద్, కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఎస్సీ అభివృద్ధి అధికారి శ్రీలత పాల్గొన్నారు.

**అధికారులపై అసహనం..**

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అధికారులపై అసహనం చెందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. సమావేశానికి పూర్తి స్థాయి సమాచారం లేకుండా కొందరు అధికారులు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు పథకాలు అందజేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

## సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ ప్రావీణ్య**

నయీంనగర్, జనవరి 17 : ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హులైన లబ్ధిదారుల వివరాలను పకడ్బందీగా సేకరించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం వడ్డేపల్లి పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అన్ని వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా సర్వే అధికారులు నమోదు చేసుకోవాలన్నారు. సర్వేను గడువులోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజేందర్ పాల్గొన్నారు.

## 64 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ఆత్మకూరు : రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

ఆత్మకూరు/కమలాపూర్/హసన్‌పర్తి, జనవరి 17 : ఆత్మకూరు మండలం చౌళ్లపల్లి గ్రామ శివారులో ఫారమ్ వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పెద్దాపురం నుంచి 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం మహారాష్ట్రకు సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సంతోశ్‌కుమార్ తెలిపారు. దామెర మండలం దుర్గంపేట గ్రామానికి చెందిన రమేశ్, ములుగు జిల్లా మల్లంపల్లి మండలానికి చెందిన కుమార్ గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ట్రాలీలో తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. ఎస్సై తిరుపతి పాల్గొన్నారు. కమలాపూర్ మండలంలోని అంబాల గ్రామంలో 14క్వింటాళ్ల రేషన్ బియ్యం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. గ్రామంలోని బోయిని సాయిలు ఇంట్లో పట్టుబడినట్లు చెప్పారు. హసన్‌పర్తి మండలం నాగారంలోని గాంధీ విగ్రహం నుంచి సూదన్‌పల్లికి మినీ వ్యాన్‌లో తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఏఎస్సై మల్లికార్జున్, పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. సీఐ చేరాలు కథనం ప్రకారం.. హనుమకొండ వడ్డేపల్లి ఎస్సీకాలనీకి చెందిన కట్ల మనోహర్ మినీ వ్యాన్ అద్దెకు తీసుకొని చుట్టుపక్కల గ్రామాల్లో కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వ్యాన్ సీజ్ చేసి, అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

## వైన్స్ తొలగించాలని ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు


ఎక్సైజ్ సీఐ తాతాజీకి ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శాయంపేట, జనవరి 17 : మండలంలోని శాయంపేట, కొప్పులలో ఏర్పాటు చేసిన వైన్ షాపులను తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాయంపేట, కొప్పుల గ్రామంలోని వైన్ షాపులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పబ్లిక్ ఏరియాల్లో కొనసాగుతున్నాయని, మందుబాబులు నడిరోడ్డుపై వాహనాలు నిలిపి తాగుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మడికొండ ప్రశాంత్, బొచ్చు ఈశ్వర్, గణేశ్, పవన్ పాల్గొన్నారు.

17పీకెఎల్03ఏ-ఓగులాపురంలో ఫీల్డ్ వెరిఫికేషన్ పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రంగాచారి

## తప్పులు లేకుండా వెరిఫికేషన్ చేయాలి

దామెర, జనవరి 17 : ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్ తప్పులు లేకుండా ఉండాలని స్పెషల్ అధికారి కేవీ రంగాచారి అన్నారు. శుక్రవారం ఓగులాపురం గ్రామంలో జరుగుతున్న ఫీల్డ్ వెరిఫికేషన్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, కారోబార్ శ్రీను పాల్గొన్నారు.

## పుట్‌బాల్ పోటీలు ప్రారంభం

కాజీపేట, జనవరి 17 : ఫాతిమానగర్‌లోని సెయింట్ గ్యాబ్రియల్ ఉన్నత పాఠశాల మైదానంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ మూడో వార్షిక క్రీడలు, స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా శుక్రవారం పుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ వెస్ట్‌జోన్ టీం, సెంట్రల్ జోన్ టీం మధ్య మ్యాచ్ ప్రారంభించి మాట్లాడుతూ.. పోలీసుల క్రీడోత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కాజీపేట, కేయూసీ, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్‌రెడ్డి, రవి కుమార్, గోపిరెడ్డి, సుక్కు పాల్గొన్నారు.

## కేయూ విద్యాకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రాంచంద్రం బాధ్యతలు

హనుమకొండ చౌరస్తా, జనవరి 17 : కాకతీయ విశ్వవిద్యాలయ విద్యా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రామచంద్రం ప్రస్తుత ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రణధీర్ రెడ్డి నుంచి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆదర్శ పొదుపు సంఘం సభ్యులు

## ఆదర్శ పొదుపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

హనుమకొండ, జనవరి 17 : హనుమకొండ గాంధీనగర్ ఆదర్శ పొదుపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గాంధీనగర్ ఆర్చి వద్ద షైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్, పొదుపు సంఘ గౌరవాధ్యక్షుడు మర్రి రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు మాదాడి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి వీరేందర్, ఆర్థిక కార్యదర్శి దుగ్యాల వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షులు గోపగోని అశోక్, నక్క శ్రీరాం, సంయుక్త కార్యదర్శి బత్తిని శ్రీనివాస్, సహాయ కోశాధికారి పీవీ రమణ, డైరెక్టర్ల సమక్షంలో ఆవిష్కరించారు. సంఘం సభ్యత్వం 100మందికి చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నక్క లింగయ్య, పెసరు ప్రకాశ్‌రెడ్డి, కాసర్ల వెంకటేశ్వరరావు, మర్రి యాదవరెడ్డి, నక్క రాజేందర్, సుధాకర్ రావు, కొత్త కరుణాకర్ పాల్గొన్నారు.

## కేయూ వ్యాయామ విద్య పాఠ్యప్రణాళిక అధ్యక్షుడిగా రవికుమార్

హనుమకొండ చౌరస్తా, జనవరి 17 : కాకతీయ విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య, యోగ పాఠ్య ప్రణాళికా అధ్యక్షుడిగా వరంగల్ నిట్ వ్యాయామ విద్యావిభాగ ఆచార్యుడు రవికుమార్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రవికుమార్ ఈ పదవిలో రెండు సంవత్సరాలు కొనసాగనున్నారు.

## పైపులైన్ లీకేజీ.. వృథాగా తాగునీరు


ప్రభుత్వ వృత్తివిద్య కాలేజీ ఎదుట పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

హనుమకొండ చౌరస్తా, జనవరి 17 : హనుమకొండ ప్రభుత్వ వృత్తివిద్య కాలేజీ ఎదుట పైపులైన్ లీకేజీతో నీళ్లు రోడ్డుపై కాల్వలా పోతున్నాయి. నల్లా వచ్చిన ప్రతిసారీ ఇలాగే రోడ్డుపై వృథాగా నీరు పోతున్నదని విద్యార్థులు చెబుతున్నారు. కాలేజీ ప్రధాన గేటు ఎదుట నీళ్లు ప్రవహిస్తుండటంతో లోపలికి వెళ్లేందుకు విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.